క్లుప్తంగా

నేడు జగనన్న సురక్ష

హనుమంతునిపాడు: మండలంలోని వాలిచర్ల, లింగంగుంట్ల గ్రామ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జీవీ.క్రిష్టారావు తెలిపారు. ఎంపీడీఓ బృందం లింగంగుంట్ల గ్రామ సచివాలయంలో, తహసీల్దార్ ఎస్ హరిబాబు వాలిచర్ల సచివాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు, వలంటీర్లు, గృ హ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు హాజరు కావాలన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని అలవలపాడు, గుదేవారిపాలెంలో సోమవారం జగనన్న సురక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో ఎవరికైనా సమస్యలున్నా పరిష్కరించుకోవచ్చన్నారు.

పోలేరమ్మ తల్లి ఉత్సవం



పోలేరమ్మ తల్లిని అలంకరించిన దృశ్యం

వలేటివారిపాలెం: మండలంలోని అత్తంటివారిపాలెం పోలేరమ్మ తల్లి ఆలయ ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసుకొని పొంగళ్లు పెట్టుకున్నారు. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ యువత భారీగా పాల్గొని గ్రామ ప్రజలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పొంగళ్లు

గుడ్లూరు: మండలంలోని బసిరెడ్డిపాలెంలో గ్రామదేవత పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొగళ్లు పెట్టారు. గ్రామంలోని మహిళలంతా ఇళ్ల వద్దే పొంగళ్లు పెట్టుకొని మేళతాలాలతో, బాణాసంచాలతో ఊరేగింపుగా గ్రామ శివారులో ఉన్న పోలేరమ్మ ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ పొంగళ్లను పెట్టుకున్న గ్రామస్తులు తెలిపారు.

నేడు అన్నదానం

పామూరు: గురుపౌర్ణమి సందర్భంగా నేడు స్థానిక పోస్టాఫీస్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో సోమవారం మహాఅన్నదాన నిర్వహించనున్నట్లు దేవస్థాన చైర్మన్ పబ్బతి వెంకట సుబ్బయ్య తెలిపారు. భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేడు ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

గుడ్లూరు: స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మండలంలో సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ వినయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన సుమారు రూ.16 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి వివరాలను ప్రజా వేదికలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ముగ్గురు జూదరుల అరెస్టు

కొండపి: మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమణయ్య ఆదివారం తెలిపారు. జూదరులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు. పేకాట శిబిరాలు, అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలియజేయాలని ప్రజలను ఎస్సై కోరారు.

9న ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ

టంగుటూరు: గుంటూరు జిల్లా కాజ గ్రామం వద్ద ఈ నెల 9న ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని బీసీ సంఘ నాయకులు కోరారు. విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథులుగా ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమ వాల్‌పోస్టర్లను పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బొట్ల రామారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు బొట్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



టంగుటూరులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు
- కలికివాయిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

సింగరాయకొండ(టంగుటూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం సింగరాయకొండ మండలంలోని కలికివాయ గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఇంటింటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో వారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్ అందించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. సీఎం జగనన్న ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు బలహీన వర్గాల వారు అట్టడుగు స్థాయిలో ఉండేవారన్నారు. జగనన్న సీఎం అయ్యాక వారి జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. పేదల అభ్యున్నతిని ఓర్వలేని చంద్రబాబు, పచ్చ మీడియా సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ సీఎం జగనన్నపై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాళ్లని నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, గుండపరెడ్డి శ్రీహరిరెడ్డి, సింగరాయకొండ మండల జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, ఎంపీటీసీ ఉలిచి అరుణ, విద్యా కమిటీ చైర్మన్ చామల వేణుగోపాల్‌రెడ్డి, వీరారెడ్డి, గొరవ్వరపు నాగేశ్వరరెడ్డి, చిడిపూడి కృష్ణారెడ్డి, తన్నీరు కృష్ణ, బెల్లంకొండ నరసింహారావు, యన్నాబత్తిన చిన్నా, షేక్ సలీం బాషా, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా వల్లూరమ్మ తల్లి



శాకంబరీదేవి అలకారంలో వల్లూరమ్మ తల్లి



శాకాంబరి అలంకారం కామాక్షి అమ్మవారు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర ఆషాఢ మాస సందర్భంగా ఆదివారం వల్లూరమ్మ తల్లి శాకాంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసరావు, ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకాంబరి అలంకారంలో అమ్మవారు

కందుకూరు: ఆషాడమాసం సందర్భంగా కనిగిరి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆవరణలోని కామాక్షి అమ్మవారు ఆదివారం శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూలు, ఆకులు, కూరగాయలతో అమ్మవారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

ప్రత్యేక పూజల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి పలు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

విద్యుత్ తీగ తెగిపడి మహిళకు గాయాలు

సీఎస్‌పురం(పీసీపల్లి): మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి దేవాలయ పరిసరాల్లో ఆదివారం విద్యుత్ తీగ తెగి విద్యుత్‌కు అంతరాయం కలిగించింది. ఈ ఘటనలో ఒక మహిళలకు గాయాలయ్యాయి. స్పందించిన సర్పంచ్ బుజ్జి బ్రదర్స్ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. గాయాల పాలైన మహిళలను సర్పంచ్ బుజ్జి బ్రదర్స్, దేవాలయ చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ తో కలసి పరామర్శించారు.



మహిళను పరామర్శిస్తున్న సర్పంచ్ బుజ్జి బ్రదర్స్, ఆలయ చైర్మన్ ఆదినారాయణ

మాజీ ఏజీపీ కొప్పల్లి సుబ్బరాయుడు మృతి

- నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ గఫార్, వివిధ పార్టీల నాయకులు



కొప్పల్లి సుబ్బరాయుడు(ఫైల్)

కనిగిరి రూరల్: సీనియర్ న్యాయవాది, రెండు దఫాలు ఏజీపీ, ఏపీపీగా పనిచేసిన కొప్పల్లి సుబ్బారాయుడు(84) ఆదివారం మృతి చెందారు. ఉదయం కాల కృత్యాలు తీర్చుకునే క్రమంలో జారి పడిన సుబ్బరాయుడును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. కొప్పల్లి సుబ్బారాయుడు 1969 నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్నారు. సుబ్బారాయుడు స్వగ్రామం పామూరు మండలం కొడిగుంపల గ్రామం. అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం స్వగ్రామంలో జరుగుతాయని తెలిపారు.


పలువురు నివాళి

న్యాయవాది కొప్పల్లి సుబ్బారాయుడు భౌతికకాయాన్ని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు సందర్శించి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సీహెచ్ సాల్మన్ రాజు, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, మాజీ జిల్లా పీపీ ఇంకొల్లు వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ కిషోర్, మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి జి.ఎరిక్షన్ బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి వై రవీంద్ర బాబు, సయ్యద్ యాసీన్, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ నాయకులు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. అలాగే ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, న్యాయవాదులు

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి



అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న భక్తులు

టంగుటూరు: టంగుటూరులో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మ కొలుపులు ఆదివారం పొంగళ్ల కార్యక్రమంతో ముగిశాయి. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు ఉదయం పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి ఎడ్ల బండ్లు కట్టి గ్రామోత్సవం నిర్వహించారు.

11 మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 11వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సాయిబాబాకు వెండి గొడుగు బహూకరణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయానికి ఆదివారం యక్కలి వెంకటనారాయణ అనే భక్తుడు రూ.5 లక్షల విలువైన వెండి గొడుగు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా బాబా విగ్రహానికి వెండి గొడుగును అలంకరించాలని మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావుకు కోరారు. కాగా సోమవారం గురుపౌర్ణమి వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు తెలిపారు. బాబాకు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గోపాలుని కృష్ణ మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఆక్రమణల తొలగింపు

గిద్దలూరు రూరల్: గుంటూరు గుంతకల్ మధ్యలో గల రైల్వే డబుల్ లైన్ పనుల్లో భాగంగా పట్టణంలోని పాములపల్లె రైల్వే గేటు రాచర్ల రైల్వే గేటు మధ్యలో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, రైల్వే అధికారులు ఆదివారం తొలగింపు చర్యలు చేపట్టారు. గిద్దలూరు రెవెన్యూ పరిధిలోని హిల్ 10 కొండపోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న గృహాలు రైల్వే డబుల్ లైన్‌కు అడ్డు రావడంతో వాటిని తొలగించి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు

కురిచేడు: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరటంతో మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, దర్శి మాజీ శాసన సభ్యులు డా. బూచేపల్లి శివప్రసాదరెడ్డి సహకారంతో జూనియర్ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి కళాశాల ప్రారంభం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

నిఘా నేత్రాలు పటిష్టం

గిద్దలూరు రూరల్: పోలీసుల ఆధ్వర్యంలో నిఘా నేత్రాలు మరింత పటిష్టం చేస్తున్నామని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ వారికి ప్రజలు సహకరించాలని కోరారు. లాడ్జింగ్‌లు, రెస్టారెంట్‌లు, సినిమా థియేటర్‌లు, ఊరి చివరగా ఉండే నివాస గృహాల యజమానులతో పాటు ప్రతి ఒక్క వ్యాపార సముదాయం వద్ద సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. సీఐ పి.దేవప్రభాకర్, ఎస్సై మహేష్ ఉన్నారు.

కంది రైతులకు రూ.11.48 కోట్ల బీమా

మార్కాపురం: డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద గతేడాది ఖరీఫ్ పంటల కాలానికి దిగుబడి ఆధారిత బీమా పథకం కింద 5,313 మంది కంది రైతులకు రూ.11.48 కోట్లు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 3,454 మంది రైతులకు రూ.2.32 కోట్ల పరిహారం మంజూరైనట్లు వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. బీమా పరిహారం లబ్ధిదారుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ఈనెల 3వ తేదీ వరకు ప్రదర్శిస్తున్నామని, అభ్యంతరాలున్న వారు 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తెలియజేయాలని స్పష్టం చేశారు. వాతావరణ ఆధారిత పంట నష్టం అంచనా కోసం మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలోని 25 ఏడబ్ల్యుఎస్ వాతావరణ కేంద్రాల్లో నమోదైన సమచారాన్ని పరిగణలోకి తీసుకుని నోటిఫికేషన్‌లోని నిబంధనల ప్రకారం లెక్కించి, వీటి ఆధారంగా బీమా పరిహారాన్ని అర్హులైన రైతులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

1009 మంది రైతులకు నష్టపరిహారం

పెద్దారవీడు: మండల పరిధిలో 2021-22 ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట దెబ్బతిన్న 1009 మంది రైతులకు 1303.11 ఎకరాలకు గానూ రూ. 1,53,58,251 కోట్లు వైఎస్సార్ పంటల బీమా ద్వారా విడుదలైనట్లు వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి ఆదివారం తెలిపారు. రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాలను ఆయా ఆర్బీకేల నోటీసు బోర్డులో ప్రదర్శించామని, రైతులు జాబితాలను పరిశీలించుకోవాలని తెలిపారు.

2836 మందికి పంటల బీమా

దర్శి: మండలంలోని 2836 మంది కంది పంట వేసిన రైతులకు రూ.34084768 పంటల బీమా వస్తుందని ఏఓ బాలకృష్ణ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం కంది పంట సరిగా పండక రైతులు నష్ట పోయారన్నారు. దీంతో కందికి బీమా వర్తించి ఇస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణ పనులు
వేగంగా పూర్తి చేయాలి



ఆలయ నిర్మాణపనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు: అంకమ్మతల్లి ఆలయ నిర్మాన పనులు వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సూచించారు. అంకమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఆలయ శిల్పి శ్రీనివాసరావుతో చర్చించారు. అనివార్య కారణాల వల్ల ఇప్పటికే నిర్మాణ పనులు కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమేనని, ఈ ఆలస్యాన్ని భర్తీ చేసేందుకు ప్రస్తుతం పనుల వేగంగా పెంచాలని సూచించారు. నిర్దేశించిన గడువు లోగా నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నం చేయాలన్నారు. వచ్చే శ్రావణ మాసంలో అంకమ్మతల్లి ఆలయాన్ని ప్రారంభించాలనే సంకల్పం నేపథ్యంలో ఆ లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే అనుబంధంగా నిర్మిస్తున్న ఉపాలయాల పనులు కూడా పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకున్నారు.

జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు శ్రీకారం



పొందూరులో పుటింగ్స్ ఏర్పాటు చేస్తున్న కూలీలు

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామంలో జగనన్న కాలనీలో ఏడు ఎస్టీ కుటుంబాలకు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సహకారంతో, గ్రామ పార్టీ నాయకులు ఏలూరి వంశీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గృహాల పుటింగ్స్‌కు ఆదివారం పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ గృహాలకు ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలతోపాటు మిగిలిన ఖర్చును వీరు భరిస్తున్నారు. లాభాపేక్ష లేకుండా పేదలకు ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ శేషగిరిరావుకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ హనుమంతురావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయినాథుని దర్శించుకున్న ఎమ్మెల్యే



బాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోవూరు రోడ్డులోని శిర్డిసాయిబాబా ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొన్నారు. గత వారం రోజులుగా గురుపౌర్ణమి ఉత్సవాలు ఆలయంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి రోజు బాబాకి ప్రత్యేక అలంకరణలతో పాటు, పూజలు, పారాయణం వంటి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలో బాబా ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు బాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే ఉత్సవాల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. గురుపౌర్ణమి ఉత్సవాల వివరాలను ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి వివరించారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన చైర్మన్



భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: బీసీ సంక్షేమ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బాలికల నీటి సమస్యపై చైర్మన్ గఫార్‌కు విన్నవించగా, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరమ్మతులకు గురైన బోరును పరిశీలించారు. నీటి సమస్యపై నిర్లక్ష్యంగా వహిచడంపై హాస్టల్ సంక్షేమ వెల్ఫేర్ అధికారులు సాలింబాయ్, జబ్బార్‌లతో చర్చించారు. ట్యాంకర్ల ద్వారా నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పులి విజయలక్ష్మి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో కొండపి గ్రామ సచివాలయం

నేడు కొండపిలో గ్రామ సచివాలయం ప్రారంభం

కొండపి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నూతనంగా 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ప్రారంభిస్తున్నట్లు కార్యనిర్వాహకులు చుండూరి కామయ్యచౌదరి తెలిపారు. మౌలిక వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రానుండటంతో సచివాలయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొండపి నడిబొడ్డులో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేసి, 50 లక్షల రూపాయల నిధులతో సచివాలయాన్ని నిర్మించి పంచాయతీకి ఆస్తిగా ఇవ్వడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.